# నాలుగు వేల ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం: మంత్రి గంటా

**దెందులూరు, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని 4 వేల పాఠశాలల్లో ఈ ఏడాది ఆంగ్ల మాధ్యమం అమలు చేస్తున్నట్లు ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో.. ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్ విద్యార్థులకు సమకూర్చిన రాత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో శనివారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.5 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

# నేడు కాపు, బీసీ విద్యోన్నతి పథకం ప్రవేశ పరీక్ష

**కాకినాడ, న్యూస్‌టుడే:** కాపు, బీసీ విద్యోన్నతి పథకం ప్రవేశ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనుందని పథకం రాష్ట్ర కన్వీనర్ ఆచార్యులు వీవీ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, ఒంగోలు, తిరుపతి, అనంతపురం, కడప పట్టణాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఏపీపీఎస్సీ ద్వారా పర్యావరణ ఇంజినీర్ల నియామకం

**ఈనాడు, హైదరాబాద్:** పురపాలికల్లో ఘనవ్యర్థాలు, పారిశుద్ధ్య, పర్యావరణ ప్రాజెక్టుల నిర్వహణకు ప్రత్యేకంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సర్వీసు నిబంధనల్ని పురపాలకశాఖ రూపొందించింది. ఏఐసీటీఈ, యూజీసీ, రాష్ట్ర చట్టాల కింద గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల నుంచి ఇంజినీరింగ్‌లో పర్యావరణ, సివిల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొంది. సహాయ ఇంజినీర్ (పర్యావరణ) పోస్టులన్నీ ఏపీపీఎస్సీ ప్రత్యక్ష నియామకం ద్వారా చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి కరికల్ వలెవన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు సూత్రాల జోనల్ వ్యవస్థ కింద ఈ నియామకాలు చేపట్టనున్నారు.

# ఫిజియోథెరపీ డిగ్రీ ఫలితాల విడుదల

**ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే:** ఈ ఏడాది ఏప్రిల్, మేలో జరిగిన ఫిజియోథెరపీ డిగ్రీ (బి.పి.టి.) మొదటి నుంచి నాలుగేళ్ల ఫలితాలు విడుదలయ్యాయి. విశ్వవిద్యాలయ మార్గనిర్దేశాల ప్రకారం గ్రేస్ మార్కులు కలిపిన తర్వాతే ఫలితాలను విడుదల చేసినట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి.విజయ్‌కుమార్ తెలిపారు. వ్యక్తిగత గుర్తింపు, రీ టోటలింగ్ కోరే అభ్యర్థులు సంబంధిత రుసుముతో రిజిస్ట్రార్ పేరిట డీడీ తీసి.. జులై 5వ తేదీ లోపుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు కళాశాలల కోడ్ 28 నుంచి 45 మధ్య గల వారు జులై 19న, 46-197 కళాశాలల కోడ్ వారు జులై 20న యూనివర్సిటీకి హాజరుకావాల్సి ఉంటుంది. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ http://ntruhs.ap.nic.in, eenadupratibha.-net లో చూడొచ్చు